



చరిత్ర సృష్టించిన త్రిష



అండర్-19 టీ20 మహిళల ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష రికార్డు స్థాయిలో సెంచరీ సాధించి చరిత్ర సృష్టించింది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ప్రపంచకప్ క్రికెట్ పోటీల్లో భారతజట్టు తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న త్రిష మంగళవారం స్కాట్‌ల్యాండ్‌తో జరిగిన పోటీలో ఆ జట్టు బౌలర్లపై విరుచుకుపడింది. ఓపెనర్‌గా బరిలో దిగిన త్రిష తొలినుంచి దాటిగా బ్యాటింగ్ ప్రారంభించి బౌండరీలు, సిక్సర్లతో ప్రత్యర్థి జట్టు బౌలర్లకు చెమటలు పట్టించింది. ఈ క్రమంలో కేవలం 53 బంతుల్లో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో అండర్-19 టీ 20 మహిళల ప్రపంచకప్‌లో తొలి సెంచరీ చేసి ఘనత సాధించింది. కాగా జట్టు నిర్ణీత 20ఓవర్ల వరకు బ్యాటింగ్ చేసిన త్రిష 110 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఈ క్రమంలో స్కోర్‌ను 13 ఫోర్లు, నాలుగు సిక్సర్ల సహాయంతో చేరుకుంది. అదేవిధంగా స్పిన్ బౌలింగ్ చేసి స్కాట్‌ల్యాండ్ జట్టుకు చెందిన ముగ్గురు బ్యాటర్లను అవుట్ చేయగా కేవలం ఆరు పరుగులు మాత్రమే ఇవ్వడం విశేషం.

కొడితే కొట్టాలిరా..

- ప్రపంచ రికార్డు నమోదు చేసిన యువ కెరటం
- 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లు, 110 పరుగులతో నాటౌట్
- బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర
- భద్రాచలంలో హర్షాతిరేకాలు

అండర్-19 టీ 20 తొలి సెంచరీ నమోదు



భద్రాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కౌలాలంపూర్‌లో జరుగుతున్న ప్రపంచకప్‌లో త్రిష సూపర్ ఫాంలో దూసుకుపోతోంది. ఇటీవల శ్రీలంకతో జరిగిన పోటీలో 44 బంతుల్లో ఐదుఫోర్లు, ఒక సిక్స్‌తో 49 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర వహించడంతో ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికైంది. అలాగే బంగ్లాదేశ్‌తో జరిగిన పోటీలో సైతం 40 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. తాజాగా స్కాట్‌ల్యాండ్‌తో జరిగిన పోటీలో పూర్తిస్థాయిలో ప్రత్యర్థి జట్టు బౌలర్లపై విరుచుకుపడి 53 బంతుల్లో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో రికార్డుస్థాయిలో సెంచరీ సాధించడమే కాకుండా చివరి వరకు ఉండి 110 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది.

అభినందించిన మంత్రి పొంగులేటి

పేరుకు తగ్గట్టే త్రిష క్రికెట్‌లో దూసుకుపోతుండటం పట్ల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి త్రిషను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. త్రిష తొలి సెంచరీ సాధించి భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా ప్రపంచ రికార్డు సాధించడంతో భద్రాద్రి వాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ విషయం తెలిసిన వెంటనే సామాజిక మాధ్యమాల్లో త్రిష సెంచరీ చేసిన వీడియోను, ఫొటోలను పోస్టు చేసి భద్రాద్రివాసులు తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నారు. భద్రాద్రికి చెందిన సీనియర్, యువ క్రికెటర్లు, పుర ప్రముఖులు, క్రికెట్ అభిమానులు, రాజకీయ నాయకులు సంఘీభావంగా ర్యాలీ సైతం నిర్వహించారు. కాగా, త్రిష తండ్రి రాంరెడ్డి భద్రాచలం పట్టణంలోని బీపీఎల్ స్కూల్‌లో కొంతకాలం ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. పదేళ్ల క్రితం త్రిష కోసం హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారు. అక్కడే ఉంటూ ఆమెకు క్రికెట్‌లో తర్ఫీదునిచ్చారు. కౌలాలంపూర్‌లో ఉన్న ఆయన మంగళవారం రాత్రి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ త్రిషకు బాల్యం నుంచే క్రికెట్ క్రీడలో భద్రాద్రిలో ఓనమాలు నేర్పించానన్నారు. హైదరాబాద్‌కు మకాం మార్చిన తర్వాత నిపుణులైన శిక్షకుల వద్ద శిక్షణ ఇప్పించామన్నారు. తన కుమార్తె భారత మహిళా జట్టు సభ్యురాలిగా ప్రాతినిధ్యం వహిస్తే చూడాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. త్రిష తల్లి మాధవి గృహిణిగా ఉన్నారు.



భద్రాచలం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

'వనజీవి' దంపతులకు సత్కారం

'పర్యావరణ' కృషిని కొనియాడిన సీఎం రేవంత్



వనజీవి రామయ్యను సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఖమ్మం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సన్మానించారు. రంగారెడ్డి జిల్లా పొద్దుటూరు గ్రామంలో ఎక్స్‌పీరియం పార్కు ప్రారంభోత్సవానికి వచ్చిన రామయ్యను సీఎం గుర్తించి వేదికపైకి పిలిచి సన్మానించారు. రైతు కుటుంబం నుంచి వచ్చి పర్యావరణం కోసం నిత్యం కృషి చేస్తున్న రామయ్యను అభినందించారు. వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రామయ్యను ఆదర్శంగా తీసుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం వెంట మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీనటుడు చిరంజీవి, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారులను విస్తరించండి

- అవసరమైన బ్రిడ్జిలు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి తుమ్మల లేఖ



ఖమ్మం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో రహదారులను విస్తరించాలని, పలుచోట్ల బ్రిడ్జిలు నిర్మించాలని కేంద్ర రవాణశాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలో కోరారు. రహదారులతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, మంగళవారం పంపిన లేఖలో పేర్కొన్నారు. లేఖలో చేపట్టిన రహదారులు ప్రతిపాదనలు మంత్రి తుమ్మల తెలియజేశారు. జిల్లాలో పలుచోట్ల బ్రిడ్జిలు సెంట్రల్ లైటింగ్‌లు ఏర్పాటు చేయాలని (మిగతా 6వ పేజీలో)

బతుకు వేటలో... వలస బాట

శ్రమయేవ జయతే...

జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో మిరపతోటలు ఏరుతున్న ఒరిస్సా కూలీలు





వాళ్లు శ్రమజీవులు.. పూట గడవడం కోసం ఎక్కడికైనా పొట్టచేత పట్టుకొని తరలివచ్చే కూలీలు.. పని తప్ప వారికి మరే ధ్యాస ఉండదు. చేపట్టిన పనిని గడువులోగా పూర్తి చేస్తారు.. మాట్లాడుకున్న పైకానికి ఒక్కరూపాయి కూడా ఎక్కువ అడగరు. క్రమశిక్షణతో ఉంటారు.. వాళ్లే వలస కూలీలు. ఇప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మిర్చి కోతల సీజన్ నడుస్తోంది. ఈ కోతల్లో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిసా రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు చురుగ్గా పనిచేస్తూ సందడి చేస్తున్నారు. స్థానికంగా ఏర్పడిన కూలీల కొరతను ఈ వలస కూలీలు పూర్తిగా తీరుస్తున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మిర్చి ఏరే పనిలో పాల్గొంటున్నారు. కొందరు తోటల వద్దే తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలతో నివాసం ఉంటుండగా, మరికొందరు సరిహద్దులోని ఇతర రాష్ట్ర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చి పని చేస్తున్నారు. రైతులు ఒక్కొక్క కూలీకి రోజూ రూ.300 చెల్లిస్తున్నారు. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో 30 వేల మంది, ఖమ్మం జిల్లాలో 20 వేల మంది పనిచేస్తున్నట్లు సమాచారం.


- ఉమ్మడి జిల్లాలో మిర్చి ఏరే పనుల్లో కూలీలు బిజీ
- ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా రాష్ట్రాల నుంచి రాక
- ఉమ్మడి జిల్లాలో 50వేల మంది వరకు ఉంటారని అంచనా
- తోటల వద్దే తాత్కాలిక గుడారాల్లో నివాసం
- ఒక్కొక్కరికి రోజుకు రూ.300 పైనే కూలి

కొత్తగూడెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలకు నిలయమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కూలీల కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. పత్తి, మిర్చి పంటలు చేతికొచ్చే దశలో పంట తీసుకునేందుకు సరైన సమయంలో కూలీలు దొరక్కపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఇలాంటి పరిస్థితుల్లో వలస కూలీలు జిల్లా రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతుండగా 'ఉపాధి'ని వెతుక్కుంటూ వలస కూలీలు భారీ సంఖ్యలో ఇరు జిల్లాలకు తరలివస్తున్నారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు.

వలస కూలీలే ఆసరా..

ప్రస్తుతం మిర్చి కోతలు జోరుగా సాగుతుండగా కూలీలకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ నేపథ్యంలో మిర్చి రైతులకు వలస కూలీలు వరంగా మారారు. వలస కూలీలు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మిర్చి కోతలు కోస్తారు. తోటల వద్దే తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. కొందరు రాష్ట్ర సరిహద్దు (మిగతా 6వ పేజీలో)

మా దగ్గర వర్షాకాలంలోనే పని
పప్పిత, మహారాష్ట్ర



మా గ్రామంలో వర్షాకాలంలోనే పని లభిస్తుంది. మిగతా రోజుల్లో పనులు లేకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. ఇక్కడ పనులు ఉండటంతో వలస వచ్చాం. ఇక్కడ రైతులు వలస కూలీలను ఎంతో అప్యాయంగా చూసుకుంటారు. కుటుంబ పోషణతో పాటు కొంత డబ్బు సంపాదించుకుని ఇళ్లకు వెళ్తాం..



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న పద్మశ్రీ

డీఆర్వోగా పద్మశ్రీ బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా పద్మశ్రీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మెదక్‌లో డీఆర్వోగా పనిచేస్తున్న ఆమె సెలవులో ఉంటూ ఖమ్మానికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ రైల్వే పీపీటీస్ రాజేశ్వరి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె స్థానంలో పద్మశ్రీని నియమిండంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమెకు పూర్వపు డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకు డు కారుమంచి శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా పురంధర్



ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా బోడేపుడి పురంధర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా వ్యవహ రించిన కె.సత్యనారాయణ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేస్తున్న పురంధర్‌ను డిప్యుటేషన్‌పై ఖమ్మం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మధిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా 'బండారు'



ఎర్రుపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎర్రుపాలెం మండలానికి చెందిన కాంగ్రెస్ నేత బండారు నర్సింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఈ సారి బీసీ రిజర్వేషన్ కావడంతో పార్టీకి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విధేయుడిగా ఉన్న కాపు సామాజిక వర్గానికి చెందిన నర్సింహారావుకు ఈ పదవి కట్టబెట్టారు. రాజులదేవరపాడుకు చెందిన నర్సింహారావు గతంలో ఉమ్మడి మామునూరు గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు. భట్టికి నమ్మినబంటుగా 2023 సాధారణ ఎన్నికల్లో మధిర ఎన్నికల ఇన్‌చార్జిగా కాంగ్రెస్‌పార్టీ అత్యధిక మెజారిటీ దిశగా కృషిచేశారు.

మండలానికి ముగ్గురు డైరెక్టర్లు

మార్కెట్ కమిటీ చైర్మన్‌తోపాటు పార్టీకోసం పనిచేసిన మరో ముగ్గురికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా భట్టి అవకాశం కలిపించారు. ఎర్రుపాలెనికి చెందిన క్లస్టర్ ఇన్‌చార్జి గూడేటి బాబురావు, బనిగండ్లపాడు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు యన్నం పిచ్చిరెడ్డి, మీనవోలుకు చెందిన మాజీ సర్పంచ్ వేమిరెడ్డి అనురాధ కు డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

కోళ్లఫామ్‌ను పరిశీలించిన బృందం

వైరస్‌తో మృతిచెందిన కోళ్ల నమూనాల సేకరణ

పెనుబల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వీఎం బంజర కోళ్ల ఫామ్‌లో వైరస్‌తో మృతిచెందిన బాయిలర్ కోళ్లను మంగళవారం పశువైద్యశాఖ కేంద్ర బృందం పరిశీలించింది. గత నాలుగు రోజులుగా వీఎం బంజర గ్రామ సమీపంలో గల కోళ్ల ఫాంలో వరుసగా వేలాది కోళ్లు మృతిచెందిన విషయం విదితమే. దీంతో పశువైద్యశాఖ జేడీ వెంకటనారాయణతో పాటుగా కేంద్ర పరిశీలక బృందం కోళ్ల ఫామ్‌లను సందర్శించి మృతిచెందిన కోళ్ల నమూనాలను సేకరించారు. సీజనల్ వ్యాధుల కారణంగా మృతి చెందాయా అనే కోణంలో నిర్ధారించేందుకు లాబోరేటరీకి కోళ్ల నమూనాలను పంపించినట్టు జేడీ వెంకటనారాయణ విలేకరులకు తెలిపారు. కోళ్లఫామ్ యాజమాని పూర్తి పరిశుభ్రత పాటించాలని సూచించారు. మృతిచెందిన కోళ్ల నష్ట పరిహారంపై బాయిలర్ పిల్లలు పంపిన యాజమాన్యంపై దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర అధికారులు విజయభాస్కరరెడ్డి, అరుణ, శిరీష ఏడీ ప్రదీప్ కుమార్, పెనుబల్లి పశువైద్యురాలు వి.సృజన పాల్గొన్నారు.



కోళ్ల నమూనాలు సేకరిస్తున్న కేంద్ర పశువైద్య బృందం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

'సీతారామ' జలాల తరలింపు అక్రమం

- స్థానిక భూములకు నీరు ఇవ్వకుండా డిజైన్ మార్చడం అన్యాయం
- ఇల్లెందు నియోజకవర్గానికి అందేలా చర్యలు చేపట్టాలి: అఖిలపక్ష నేతలు

ఇల్లెందుటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీతారామ నీటిని స్థానిక రైతులకు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించుకుపోవడం సరికాదని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అఖిలపక్ష నాయకులు బంధం నాగయ్య, గోపగాని శంకర్‌రావు, తాళ్లూరి కృష్ణలు విమర్శించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు మొదటి దశను విస్మరించి రెండో దశను ప్రభుత్వం చేపట్టి ప్రాజెక్టు ఉద్దేశాన్ని నీరుగార్చారని ఆరోపించారు. ఇష్టానుసారంగా డిజైన్లు మార్చి అశ్వారావుపేట మీదుగా ఆంధ్రాకు కలిపారని ఆరోపించారు. ఇల్లెందు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు రైతు సంఘాలు అఖిలపక్షంగా ఏర్పడి ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసినట్లు వెల్లడించారు. ఈ నెల 27న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీఫ్ అడ్వైజర్ వేం నరేందర్‌రెడ్డిని కలిసి ప్రాజెక్టు స్థితిగతులు జరిగిన లోపాలను వివరించినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గంతోపాటు ఇతర మండలాలకు అందించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాసా శ్రీనివాస్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కార్యదర్శి యాకూబ్ షావళి, సీపీఎం నాయకులు మన్నెం మోహన్‌రావు, సీపీఐ నాయకులు ఎస్‌కే.వలీ, న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి కాంతారావు, సాంబమూర్తి పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ డీడీ విచారణ



బూర్గంపాడు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని ఉప్పుసాక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ డీడీ మణెమ్మ మంగళవారం విచారణ చేపట్టారు. గత నెలలో తొమ్మిదో తరగతి విద్యార్థికి టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపించిన ఘటనపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడితోపాటు సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. టీసీ ఇచ్చి పంపిన విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు బీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలాబీమా స్పెషల్‌డ్రైవ్

- గ్రామ ప్రజలకు అందుబాటులో పోస్టల్ సేవలు
- జిల్లా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి



తపాల సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

ఖమ్మం మామిళ్లగూడెం , జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1న తపాలా జీవిత బీమా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలో తపాలాబీమా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోస్టల్‌శాఖ అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పోస్టల్ డివిజన్‌లో ప్రతి గ్రామంలోనూ కనీసం 5వేల తపాలాబీమా ప్రీమియం ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌ను అందించే పాలసీలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. తపాలాబీమాలో కనీసం డిగ్రీ చదివిన వారికి అమలు చేస్తున్నట్టు చెప్పారు. 20 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు వారు ఈ ప్రీమియానికి అర్హులన్నారు. ఉదాహరణకు రూ.183 ప్రీమియంతో ప్రతినెలా ఒక వ్యక్తి చెల్లిస్తే ఆ వ్యక్తికి 40 ఏళ్లలో రూ.3లక్షల 8వేలు అందిస్తున్నట్టు తెలిపారు. దీనితోపాటు ఏదైనా ప్రమాదవశాత్తు చనిపోయినా ఆ వ్యక్తికి బీమా సొమ్మును అందించనున్నట్టు తెలిపారు. దీంతోపాటు గ్రామీణ తపాలబీమాను కూడా అమలు చేస్తున్నామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలో ఐపీపీబీ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు బీమా పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. రూ.520లను చెల్లిస్తే రూ.10 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. తపాలాశాఖ అందిస్తున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అదనపు సూపరింటెండెంట్ సీ మల్లిఖార్జున్, ఐపీపీబీ బ్యాంకు మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ఆభరణాల అందజేత



ఆభరణాలను అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి-అరుంధతి దంపతులు రూ.5 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను మంగళవారం అందజేశారు. ఇందులో ఒక కాసుల పేరు, రెండు బంగారు గొలుసులు ఉన్నాయి. ఈ ఆభరణాలను ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకుడు కత్తి శ్రీనివాస్‌కు అందజేశారు. ఏపీలోని సింహాచలానికి చెందిన శ్రీరామ్‌కుమార్ దంపతులు రూ.1.18 లక్షలు విలువ చేసే 11 గ్రాముల బంగారు గాజులను స్వామివారికి అందజేశారు.

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కోదండరామ్



రామాలయంలో ఎమ్మెల్సీ కోదండరామ్

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు.

కామేపల్లి మండలానికి ప్రాధాన్యత కల్పించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు టౌన్/కామేపల్లి/ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు నియోజకవర్గ పరిధిలో గల కామేపల్లి మండలానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కోరారు. మంగళవారం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కామేపల్లి మండలంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గంలో గల కామేపల్లి మండలానికి అధికంగా నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, బ్రిడ్జిలు, చెరువులు, కుంటలతోపాటు ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్‌ను కోరారు. ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలం ఊట్కూర్, జాస్తిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్మాణల కోరకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను రూ.40లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు.

మహిళలకు అండగా ఉమెన్స్ వారియర్స్

రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాయిభాను



సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాయిభాను

చుంచుపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మహిళలకు అండగా ఇక ఎంపవర్ ఉమెన్స్ వారియర్స్ టీం సొసైటీని ఏర్పాటు చేసినట్టు తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాయిభాను తెలియజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉమెన్స్ వారియర్స్ ఆవిర్భావ నిర్మాణ సమావేశాన్ని నిర్వహించగా ఆమె పాల్గొని సొసైటీ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతానికి చెందిన తనకు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అవకాశం కల్పించిన ఫౌండర్, చైర్మన్ నరేష్ ఉప్పాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణానికి రాబోయే రోజుల్లో సొసైటీ వేసే ప్రతి అడుగు న్యాయం కోసం ఎదురు చూసే మహిళకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాలికల, మహిళల, గృహిణుల, వృద్ధుల అభివృద్ధికి, రక్షణకు, అభ్యున్నతికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, అన్ని జాతీయ వైద్య ఆరోగ్య కార్యక్రమాలు ప్రాంతాలకు అతీతంగా మహిళలందరికీ చేరువ అయ్యేలా సొసైటీ పని చేస్తుందని అన్నారు.

ఉరివేసుకొని యువకుడు మృతి

ఖమ్మం క్రైం జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటనపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నందు మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్డు ప్రాంతంలో నివాసముంగే కంచె వెకటేష్ (24) కూలి పనులు చేస్తుంటాడు. వెంకటేశ్ మద్యానికి బానిస నవ్వటంతో ఇంట్లో వాళ్లు మందలించారు. దీంతో సోమవారం రాత్రి క్షణి కావేశానికి గురై ఇంట్లో గదిలోకివెళ్లి ఉరివేసుకున్నాడు. స్థానికులు తలు పులు పగలగొట్టి లోపలికి వెళ్లగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. ఈ ఘటనపై మృతుని భార్య ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదుచేశారు.



కల్లూరులో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

పీఆర్టీయూతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

పీఆర్టీయూ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారం

కల్లూరు, జనవరి28 (ఆంధ్రజ్యోతి)పీఆర్టీయూతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరులో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. తాను సంఘం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఉపాధ్యాయుల బదిలీలో కౌన్సిలింగ్ విధానం ప్రవేశ పెట్టేలా కృషి చేశానని చెప్పారు. నాడు వైఎస్‌ఆర్ పాలనలో అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇప్పించామని గుర్తు చేశారు. పీఆర్టీయూ పోరాటం ఫలితంగానే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల, హెచ్‌ఎంల నియామకం చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా వేతనాల, పెండింగ్ బిల్లులు, హెల్త్ కార్డులు, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియను సాధించుకోవటం జరిగిందని వివరించారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూను గెలిపిస్తే ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా పధాన కార్యదర్శి ఆర్.రంగారావు, కల్లూరు మండల పీఆర్టీయూ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాకాల రమేష్, యస్‌కె చందుసాహెబ్, నాయకులు ఎండీ మౌలాలి, బోబోలు శ్రీనివాసరావు, బీరవెల్లి శ్రీను, ఎంవీకే జ్యోతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి ఆస్పత్రిలో పీఆర్‌సీ బృందం సందర్శన



సత్తుపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న పీఆర్‌సీ బృందం

సత్తుపల్లిరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని ది గాంధీగ్రామ్ రూరల్ ఇనిస్టిట్యూట్‌లోని పరిశోధనా విభాగం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ (పీఆర్‌సీ) నుంచి రీసెర్చ్ ఆఫీసర్లు మురుగేషన్, సెంథిల్‌కుమార్, ఎన్‌సీడీ పీవో డాక్టర్ డీ.రామారావు, ఎన్‌హెచ్‌ఎం డీపీవో మేకల దుర్గలు మంగళవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాతా, శిశు ఆరోగ్యం, సంతానోత్పత్తి, మరణాలు, కుటుంబ నియంత్రణ, పోషకాహారం, గ్రామీణ ఆరోగ్యం, కమ్యూనికేషన్, ప్రోగ్రామ్ మూల్యాంకనం, అన్ని విభాగాల పనితీరు, వైద్యుల వివరాలు, సమయపాలన, ఆస్పత్రి ఆవరణం, మౌలిక వసతులు, అవసరాలు, పరికరాల ఆవశ్యకత, పనిముట్లు వినియోగం, కేంద్రం నుంచి వచ్చే నిధుల వినియోగం, నిధుల అవసరాలను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేసి నమోదు చేశారు. జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, హెచ్‌డబ్ల్యూసీ, యూపీఎస్‌లను సందర్శించినట్లు రీసెర్చ్ ఆఫీసర్లు తెలిపారు. జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, ఆరోగ్యం, కుటుంబంపై పరిశీలన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ కే.వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ రాధాకృష్ణ, హెచ్ఎన్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బతుకు వేటలో వలస బాట



జూలూరుపాడులో భోజనం తీసుకుని మిర్చికోతలకు వెళ్తున్న ఒడిశా కూలీలు

పనులు లేక వలస వచ్చా

చొంపా, ఒడిశా



మా గ్రామంలో పనులు లేక ప్రతి ఏడాది ఉపాధి కోసం తెలంగాణకు వస్తున్నాను. ఏడు సంవత్సరాలుగా మిర్చికోతల పనులకు జూలూరుపాడు గ్రామానికి వస్తున్నాను. ఇక్కడ రైతులు తమకు ఉపాధిని కల్పిస్తున్నారు.

మూడు నెలలు ఇక్కడే ఉంటాం..

మడవి భద్రయ్య, మధ్యప్రదేశ్



పదేళ్లుగా మిర్చికోతల పనులకు జూలూరుపాడుకు వస్తున్నాను. మూడు నెలలపాటు ఇక్కడే ఉండి మా గ్రామానికి చెందిన పలువురు కూలీలతో మిర్చికోతల పనులు చేపడతాం. ఖర్చులు పోను ఒక్కొక్కరు రూ.20వేలు సంపాదించుకుని సొంత గ్రామానికి తిరిగి వెళ్తాం.

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాల్లోని రైతులు వాహనాల్లో వలస కూలీలను తీసుకొచ్చి మిర్చి కోతలు కోయిస్తున్నారు. మిర్చి కోతలకు ఒక్కొక్క కూలీకి రోజు రూ.300 లేదా ఒక కిలో మిర్చికోతకు రూ.10 లెక్కన కూలి చెల్లిస్తున్నారు.

ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో సుమారు 30వేలమంది, ఖమ్మం జిల్లాలో సుమారు 20వేల మంది వలస కూలీలు పనిచేస్తున్నట్లు సమాచారం. స్థానిక కూలీలకంటే వలస కూలీలు క్రమశిక్షణతో పనిచేస్తారని, తోటలకు ఎలాంటి నష్టం కలిగించకుండా మిర్చిని శుభ్రంగా కోసి కల్లాలకు చేరుస్తారని రైతులు చెబుతున్నారు. అయితే కొందరు రైతులు మాత్రం వలస కూలీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని మిర్చితూకాల్లో మోసాలు చేస్తూ వలస కూలీలను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కూలీలను తీసుకొచ్చిన ఏజెంట్లు కూడా రైతులనుంచి ఎకరానికి రూ.2వేలు కమీషన్ తీసుకుంటున్నట్లు సమాచారం.

తోటల వద్దే నివాసం

రైతులు మిర్చి కోతలకు స్థానిక కూలీలను వినియోగించాలంటే వారిని ఇతర గ్రామాలు, ప్రాంతలనుంచి రైతు తన సొంత ఖర్చుతో ఆటోలు, ట్రాక్టర్లు వంటి వాహనాలు ఏర్పాటు తోటల వద్దకు తీసుకురావాలి. మళ్లీ సాయంత్రం వారి గ్రామాల్లో దింపిరావాల్సి ఉంటుంది. దాంతో రైతులకు అదనపు భారం పడుతోంది. అదే వలస కూలీలు రైతులకు సంబంధించిన తోటల వద్దనే తాత్కాలిక గుడిసెలు వేసుకొని నివాసం ఉంటూ పనికి వెళతారు. ఉదయం 6గంటలకు తోటలకు వెళ్లి సాయంత్రం 6గంటల వరకు మిర్చి కోస్తారు. కొందరు రైతులు వలస కూలీలకు తమ ఇళ్ల వద్దే ఆవాసం ఏర్పాటు చేసి సహకరిస్తున్నారు. మొత్తంగా వలస కూలీలతో జిల్లాలోని మిర్చి రైతులకుకష్టాలు తప్పాయని చెప్పవచ్చు.

వలస కూలీలకు సైతం ఈ ప్రాంతంలో మంచి ఉపాధి లభిస్తుండడంతో ఏటా అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. మిర్చి తోటలు పూర్తి కావడంతో మేలో మళ్లీ కూలీలు తమ ప్రాంతాలకు వెళతారు. ముఖ్యంగా వలస కూలీల్లో ఏజెన్సీ ప్రాంతాలవారే అధికంగా ఉండడంతో ఆయా రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లో మేలో విప్పపువ్వు వస్తుండడంతో వలస కూలీలు తిరుగుముఖం పట్టి అక్కడి అడవుల్లో విప్పపువ్వు సేకరించి ఉపాధి పొందుతారు. వలస కూలీసులు కేవలం మిర్చి పనులకే కాకుండా వరినాట్లు, కలుపు తీత, పత్తి ఏరే పనులకు కూడా వస్తారు. తమ రాష్ట్రాల్లో పనులు లేకపోవడంతో ఉమ్మడి జిల్లాకు వలస వచ్చి పనులు చేపట్టుకుంటున్నారు.

ఏదులాపురం మునిసిపాలిటీకి అధికారుల నియామకం

ఖమ్మం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం నూతన మునిసిపాలిటీలో పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం అధికారికంగా ఐదుగురు అధికారులను మంగళవారం నియమించింది. ఏదులాపురం మునిసిపల్ కమిషనర్‌గా ప్రస్తుతం ఖమ్మం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న అహ్మద్ షఫీ ఉల్లా, ప్రత్యేకాధికారిగా కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ)గా యాకూబ్ అలీ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఆర్.సంతోష్, సీనియర్ అకౌంటెంట్‌గా సతీష్ కుమార్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ 12 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను మునిసిపల్ అధికారులు ఆయా పంచాయతీ కార్యదర్శుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వం నియమించిన అధికారులు బుధవా రం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏదులాపురం పంచాయతీ కార్యాలయం నుంచే పరిపాలన సాగే అవకాశాలు ఉన్నాయి.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

నూతనంగా ఏర్పాటైన ఏదులాపురం మునిసిపల్ కమిషనర్‌గా నియమితులైన అహ్మద్ షఫీ ఉల్లాహ్ ఏదులాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో మంగళవారం నుంచే ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుంది.

టేబుల్ టెన్నిస్‌లో జ్వలిత్‌కు ఆల్ ఇండియా మొదటి ర్యాంక్



ఖమ్మంస్పోర్ట్స్, జనవరి28(ఆంధ్రజ్యోతి): త్వరలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరగనున్న జాతీయస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలలో భాగంగా ఆల్‌ఇండియా టేబుల్‌టెన్నీస్ ఫెడరేషన్ మంగళవారం దేశంలోని క్రీడాకారులకు ర్యాంకులను విడుదల చేసింది. సబ్‌జూనియర్ విభాగంలో ఆల్‌ఇండియా ర్యాంకులలో జిల్లాకు చెందిన పరిటాల జ్వలిత్ మొదటి ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రులు పరిటాల చలపతి, శ్రీలక్ష్మి ప్రైవేటు శిక్షణ అకాడమీలో లెక్చరర్స్‌గా పని చేస్తున్నారు. ఆరేళ్లుగా సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నాడు. దేశంలోనే ప్రతిభ ఉన్న ఆటగాళ్ళ జాబితాలో జిల్లా క్రీడాకారుడు చోటు సంపాదించడం పట్ల డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, సంఘ సభ్యులు కొండా శ్రీధర్‌రావు, డాక్టర్‌లు కూరపాటి ప్రదీప్‌కుమార్, ఎంజీవీ. ప్రవీణ్, చలపతి తదితరులు అభినందించారు. జ్వలిత్‌కు కోచింగ్ ఇచ్చిన సాంబమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ రహదారులను విస్తరించండి

(5వ పేజీ తరువాయి)

కోరారు. జాతీయ రహదారుల అభివృద్ధి ద్వారానే రోడ్డు రవాణ వ్యవస్థ మెరుగు పడడంతోపాటు, ఇతర రాష్ట్రాలకు ఖమ్మం జిల్లా రహదారులు అనుసంధానంగా నిలవనున్నాయన్నారు.

దేశంలోని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయం గిరిజన సాంప్రదాయానికి నిలువుటద్దమైన భద్రాచలానికి కుంభమేళా తరహాలో రాబోయే పుష్కరాలకు భక్తులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం రహదారులు అభివృద్ధి చేయాలని సూచించారు. ఖమ్మం నాయుడుపేట జంక్షన్ నుంచి మున్నేరు బ్రిడ్జి వరకు నాలుగులైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని, ఖమ్మం-అశ్వారావుపేట రోడ్డులో కొణిజర్ల, కల్లూరు, పెనుబల్లి, దమ్మపేట నాలుగు పట్టణాల్లో నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం, సైడ్ డ్రెయిన్లు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని కోరారు. వైరా వద్ద కట్టలేరు వాగుపై సత్తుపల్లి వద్ద తమ్మిలేరు వాగుపై బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు.

నూతనంగా నిర్మించిన 365ఏ కోదాడ-ఖమ్మం జాతీయ రహదారితోపాటు గతంలో నిర్మించిన రోడ్డును కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, ఖమ్మం-కోదాడ రోడ్డులోని వెంకటగిరి నుంచి వెంకటాపురం వరకు రోడ్డు విస్తరింపజేయాలని కోరారు. సారపాక నుంచి ఏటూరు నాగారం వరకు నూతన జాతీయ రహదారి మంజూరు చేయాలని, అశ్వాపురం, మణుగూరు వద్ద పారిశ్రామికాభివృద్ధి, భద్రాచలం, మేడారం భక్తులకు ఈరహదాదరి సౌలభ్యంగా ఉంటుందనిసూచించారు. జగ్గయ్యపేటనుండి కొత్తగూడెం వరకు బోనకల్, వైరా, తల్లాడ నూతన జాతీయ రహదారి మంజూరు చేయాలని, దీనివల్ల రవాణ వ్యవస్థ మరింత మెరుగవుతుందన్నారు. సారపాకనుంచి బూర్గంపాడు, వెంకటాపురం, ములకలపల్లి, దమ్మపేట, మందలపల్లి వరకు ఉన్న రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరారు.

ప్రారంభించారు .. మూసివేశారు..

భద్రాద్రి జిల్లా డిజిటల్ గ్రంథాలయం తెరుచుకునేదెన్నడో..?



తెరుచుకోని భద్రాద్రి జిల్లా నూతన డిజిటల్ గ్రంథాలయం ఇదే..

చుంచుపల్లి, జనవరి28 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు దేవాలయాలుగా పేరు ప్రఖ్యాతలు గడిచిన గ్రంథాలయాలు గతంలో ప్రారంభించిన నేడు తెరుచుకోలేని దుస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రంలో నిర్మించిన భద్రాద్రి జిల్లా డిజిటల్ గ్రంథాలయం అత్యాధునిక హంగులతో రూ.1.50 కోట్ల నిధులతో నూతన భవనాన్ని గతేడాది నవంబరు 25న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రారంభించిన నాటి నుంచి ప్రస్తుతం రెండు నెలలు గడుస్తున్నా మూసివేసే దర్శనమిస్తుంది. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న ప్రాంతీయ గ్రంథాలయాన్ని పూర్తి స్థాయిలో నూతన డిజిటల్ గ్రంథాలయానికి మార్చాలని ప్రతి పాదన ఉన్న ఆ పనులు కనుచూపుమేరా కనిపించడం లేదు. దీంతో పోస్టాఫీస్ సెంటర్ వద్ద గల గ్రంథాలయంలో పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో కిక్కిరిసిపోతుంది. సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనంలోనికి గ్రంథాలయాన్ని మార్చాలని వాదన బలంగా వినబడుతుంది.

కమ్మేసిన పొగమంచు..



దమ్మపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా దమ్మపేటలో మంచు దప్పటిలా కమ్మేస్తుంది. ఉదయాన్నే పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహన దారులు మంచుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



టీడీపీ సభ్యత్వాల నమోదు రికార్డును పరిశీలిస్తున్న బక్కని నరసింహులు

ఐటీసీ ఎన్నికల్లో టీడీపీదే విజయం

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు
- పాల్వంచలో రాష్ట్ర నాయకుడు కనగాలకు పరామర్శ

పాల్వంచటౌన్,జనవరి28(ఆంధ్రజ్యోతి): సారపాకలోని ఐటీసీ ఎన్నికల్లో మరోసారి టీడీపీ గెలుపొందుతుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పాల్వంచలోని శ్రీనివాసకాలనీలో నివాసముంటున్న సీనియర్ టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములును పరామర్శించారు.కొంతకాలంగా అనంతరాములుఅనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని సారపాక ఐటీసీ ఎన్నికల ప్రచారం నిమిత్తం వెళుతున్న సమయంలో పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో ఇప్పటికీ 13సార్లు ఎన్నికలు జరగ్గా ఏడుసార్లు తెలుగుదేశం అనుబంధ టీఎన్‌టీయుసీ యూనియన్ విజయం సాధించిందన్నారు. త్వరలో జరగనున్న యూనియన్ ఎన్నికల్లో మిత్రపక్షాల సహకారంతో 8వసారి కూడా భారీ మెజారిటీతో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తథ్యమన్నారు. అక్టోబర్ 26 నుంచి ప్రారంభించిన తెలుగుదేశం సభ్యత్వాల నమోదులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ నికోబార్ మూడు రాష్ట్రాల్లో కలిపి నేటి వరకు ఒక కోటి 17 లక్షల పైచిలుకు సభ్యత్వాలు నమోదవడమే టీడీపీ ఎదుగుదలకు నిదర్శనమన్నారు. తెలంగాణలో సైతం భారీ స్థాయిలో సభ్యత్వాలు నమోదవడం కార్యకర్తలు, అభిమానులు ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం మాజీ అధ్యక్షుడు వెలివల దుర్గారావు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరమాచినేని రత్నాకర్‌రావు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామిని హరీష్, వాణిజ్య విభాగం మాజీ రాష్ట్ర కార్యదర్శి బత్తిని దుర్గారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కళ్యాణం లక్ష్మీపతి, నాయకులు వడ్లమూడి పూర్ణచంద్రరావు, కత్తి శ్రీను, వీరమాచినేని నరేష్, చంద్ర రవి, మేదరమెట్ల నారాయణరావు, రేగళ్ళ శ్రీను, చంద్ర వీరయ్య, జరబన సాంబశివరావు, ఇటుకల శ్రీను, చంద్ర బుద్దుడు పాల్గొన్నారు.

గిరిబిడ్డలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- సారపాక-ఏటూరునాగారం రహదారి విస్తరణకు కృషి
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కోదండరామ్

భద్రాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గిరిబిడ్డలు చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్సీ,ప్రొఫెసర్ కోదండరామ్ ఆకాంక్షించారు. మంగళవారం భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. దేశంలో ఏకైక గిరిజన బీఈడీ కళాశాల భద్రాచలంలో ఉండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చదువు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న మన దేశానికి చెందిన ఏడు లక్షల మందిని వెనక్కి పంపించేందుకు అమెరిక ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తక్కువ జీతంతో పని చేస్తున్న మన వారిని వెనక్కి పంపి అక్కడ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఆ ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకుందన్నారు. చదువుతూనే మన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, చదువుతూనే సంఘంలో గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఉపాధ్యాయులు నవీన్, కిషోర్, బోధనేతర సిబ్బంది, టీజేఎస్ నాయకులు తిప్పన సిద్దులు, రేపాక రామారావు, గుప్తా, పూనెం ప్రదీప్‌కుమార్, బి.దేవదానం, ఎం.నాగిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నబీసాహెబ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు కృషి

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకనుంచి ఏటూరునాగారం వరకు ఉన్న రహదారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటుకు ప్రభుత్వ మంత్రులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. మంగళవారం సారపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన నాలుగు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావాలని, అందుకు పూర్తి సాకారం ఇస్తామన్నారు. ఆంధ్రలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడటం జరిగిందని, మరోసారి ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్నారు. సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల అయ్యే నీళ్ల బూర్గంపాడు మండలానికి సాగు, తాగుకు అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమ నాయకుడు సిద్దులు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వర్‌రెడ్డి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మూల నాగిరెడ్డి పాల్గొన్నారు.

తలనీలాల సేకరణకు ఎట్టకేలకు వేలం ఖరారు

భద్రాచలం,జనవరి28(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలనీలాల సేకరణ వేలం ఖరారైంది. హైదరాబాదులోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం వేలం నిర్వహించారు. కోటీ 50వేలకు పాట ఖరారైనట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి. గతంలో రూ 1.15 కోట్లకు ఖరారు కాగా ఈసారి స్వల్పంగా తగ్గింది. ఇప్పటి వరకు భద్రాద్రి దేవస్థానం అధికారులు ఆరుసార్లు వేలం పాట నిర్వహించిన ఖరారు కాలేదు. ఈక్రమంలో ఎట్టకేలకు మహబూబాబాద్‌కు చెందిన కెవీఎస్ ఎంటర్ప్రై స్ సంస్థ దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, దేవాదయ శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, ఏఈఓ భవాని రామకృష్ణారావు, పర్యవేక్షకులు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

గోర్‌బోలి భాషను అధికారికంగా గుర్తించాలి

ఇల్లందు,జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చి గోర్ బోలిభాషాను అధికారిక భాషగా గుర్తించాలని న్యాయవాది ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని ఫారెస్టు గ్రౌండ్‌లో లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ఫిబ్రవరి 15న జరిగే సేవాలాల్ మహరాజ్ జయంతికి దేశవ్యాప్తంగా సెలవు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎల్‌హెచ్‌పీఎస్ లీగల్ అడ్వజర్ బస్సీలాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌నాయక్, ప్రధానకార్యదర్శి పూర్ణచందర్, నవీన్, జీవన్, బాబురావు, భద్రు తదితరులు పాల్గొన్నారు.

జాతరను వైభవంగా నిర్వహించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- చిరుమళ్ల సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద పీవో పూజలు



కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న పీవో

కరకగూడెం, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో జరగనున్న సమ్మక్క, సారలమ్మ జాతర మహోత్సవం వైభవంగా జరపాలని భద్రాలచం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని చిరుమళ్ల సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అధ్యక్షతన పీవో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ పూజారులు పీవో ప్రత్యేకంగా మేళతాలాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతర మహోత్సవం ఎక్కువ సమయం లేనందున ఇక్కడ అత్యవసర సమయంలో కావాలసిన ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఆలయం వద్ద గద్దెల మరమ్మతులు, జాతర సమయంలో భక్తులకు తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు, స్టాల్స్ తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. జాతర సందర్భంగా పలు జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చే వడ్డేలు (పడిగెలు) అయ్యే ఖర్చు ఐటీడీఏ నుంచి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జాతర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగేలా చూడాలని కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ ఆఫీసర్ డేవిడ్ రాజ్, ఆలయ కమిటీ సభ్యులు చందా భిక్షపతి, భూపతయ్య, చందా మధు, రాంబాబు, రామారావు, వీరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: పీవో

పినపాక ,జనవరి28 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల చదువుపై గురుకులం ప్రిన్సిపాల్,అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం పినపాక మండలంలోని మినీగురుకులాన్ని ఆయన సందర్శించారు. చిన్నారుల విద్యాబోధన నైపుణ్యాలను ఆయన ఒక్కొక్కర్ని అడిగి తెలుసుకుని మాట్లాడారు. చదువులో వెనుకబడ్డ పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సంక్రాంతి పండుగకు ఇళ్లకు వెళ్లిన పిల్లలందర్ని పాఠశాలలకు వచ్చేలా ప్రిన్సిపాల్ చొరవ చూపాలన్నారు. అనంతరం ప్రత్యేక అధికారి స్టోర్‌రూం వంటగది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్, ప్రత్యేక అధికారి డేవిడ్ రాజ్, మినీగురుకులం కళాశాల ప్రిన్సిపాల్ శకుంతల, ఫ్యాకల్టీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టీటీ పోటీలకు ఖమ్మం జిల్లా క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరగనున్న జాతీయస్థాయి టేబుల్‌టెన్నీస్ పోటీలకు జిల్లాకు చెందిన 12మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ వివరాలను జిల్లా టేబుల్‌టెన్నీస్ అసోసియేషన్ సెక్రెటరీ ఓలేటి సాంబమూర్తి తెలిపారు. క్రీడాకారులు పి.జ్వలిత్, జి.చార్విక్, ఎస్‌కే.ఫజల్, ఎ.ఉజ్వల్, పి.వంశిక, ఇ.హరి, కె హితేష్, ఎ.శ్రీయాన్, జి.సిరి, పి.మోహిత్‌క్రిష్ణ, ఎండీ.అనాస్, ఇ.తరుణ్ ఇటీవల జరిగిన పలు రాష్ట్రటోర్నీల్లో ప్రతిభ చూపారు. జాతీయ పోటీలకు ఎంపికైనారని తెలిపారు. వీరిని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, జిల్లా టేబుల్‌టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, సంఘ సభ్యులు కొండా శ్రీధర్‌రావు, డాక్టర్‌లు కూరపాటి ప్రదీప్‌కుమార్, ఎంజీవీ. ప్రవీణ్, చలపతి, మజార్,పవన్,కామేశ్వరి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

గిరిజన చట్టాలకు తూట్లు

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- గిరిజనుల ఫిర్యాదుతో గిరిజనేతరుల ఆందోళన
- ఎల్‌టీఆర్ ఉల్లంఘనల నోటీసుల జారీ



షెడ్యూల్ ప్రాంత భూముల్లో నిర్మించిన భవనాలు

ఇల్లెందు, జనవరి28(ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఇల్లెందు మండలం ఇల్లెందు మండలం కరెంట్ కార్యాలయ ఏరియాలో గిరిజనేతరులు యథేచ్ఛగా భారీ భవనాలు, షోరూంలు, ఫంక్షన్ హాల్‌లు, నివాస భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ పొడుగు రాంబాబు ఫిర్యాదు చేయడంతో గిరిజనేతరులపై విచారణ ప్రారంభమైంది. కరెంట్ ఆఫీస్ ఏరియాలోని సుభాష్‌నగర్, బాలజీనగర్ గ్రామపంచాయతీల పరిధి షెడ్యూల్డ్ చట్టాల పరిధిలో ఉన్నప్పటికీ గిరిజనేతరులు కోట్లాది రూపాయల విలువైన భూముల్లో అక్రమంగా భవన సముదాయాలు నిర్మిస్తున్నరని గిరిజన సంక్షేమ శాఖకు ఫిర్యాదు చేయడంతో 12మంది గిరిజనేతరులకు ఎల్‌టీఆర్ చట్టాల ఉల్లంఘనలపై ఏజెన్సీ డివిజనల్ కోర్టు నోటీసులు జారీ చేసింది.

సర్వే నెంబర్ 603లో షోరూంలు, విలాస భవనాలు, వ్యాపార సముదాయలు, నిర్మించినట్లు పిటిషనర్ కోర్టుకు తెలిపారు. కొద్ది సంవత్సరాలుగా సద్దుమనిగిన ఎల్‌టీఆర్ యాక్టు బెడద తిరిగి ప్రారంభం కావడంతో కోట్లాది రూపాయలు వెచ్చించి భారీ భవనాలు, వ్యా పార సముదాయాలు నిర్మించుకున్న గిరిజనేతరుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఎల్‌టీఆర్ చట్టాలు 1959, మరియు 1/70 చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు అసైన్‌లాండ్‌లు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేశారని పిటిషనర్ ఏజెన్సీ డివిజనల్ కోర్టుకు వివరించారు. ఈనేపథ్యంలో కరెంట్ ఆఫిస్ ఏరియాలో బడా వ్యాపారులు, గిరిజనేతరులు నిర్మించిన 12 మంది అక్రమ నిర్మాణాలపై ఏజెన్సీ కోర్టు నోటీసులు జారీ చేసి విచారణ చేపటడంతో నిర్మాణం చేసిన గిరిజనేతరులు, ప్రభుత్వ భూముల అక్రమణలకు పాల్పడిన వారిలో దడ ప్రారంభమైంది. గ్రామపంచాయతీల అనుమతులు లేకుండా పెసా, ఎల్‌టీఆర్ చట్టాలకు విరుద్ధంగా జరిగిన అక్రమ నిర్మాణాలతో ఆదివాసీ నాయకులు దృష్టి సారించడం, వాటిపై ఫిర్యాదు చేస్తుండడంతో గిరిజనేతరులు పాలుపోని స్థితిలో కొట్టుమిట్టడుతున్నారు. ఎల్‌టీఆర్ ఉపద్రవాన్ని తప్పించుకోవడానికి వివిధ రితుల్లో ప్రయత్నాలు ప్రారంబించారు. కాగా పిటిషనర్ తరుపున న్యాయవాది ఆరెం పాపారావు ఏజెన్సీ కోర్టులో వాదనలు వినిపిస్తుండడం గమనార్హం.

బ్యాంకుల వద్ద భద్రతను ఏర్పాటు చేసుకోవాలి: ఎస్పీ

కొత్తగూడెం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల వద్ద బ్యాంక్ అధికారులు భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. బ్యాంకుల లోపల, వెలుపల అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల్లో ఉండే సెక్యూరిటి అలారం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏటీఎంల్లో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. సామాజిక బాధ్యతలో భాగంగా సైబర్‌క్రైమ్స్‌పై బ్యాంకుల తరఫు నుంచి కూడ జిల్లా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిలో భాగంగ కరపత్రాలను, పోస్టర్లను తయారు చేసి జనసమీకరణ ప్రదేశాల్లో అతికించాలని సూచించారు. ఇటీవల వరంగల్, బీదర్ ప్రాంతాల్లో బ్యాంకుల్లో జరిగిన దొంగతనాలను ఉద్దేశించి అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండ బ్యాంకు అధికారులు తమ తమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా బ్యాంకు అధికారులకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రభాను, సతీష్‌కుమార్, రవీందర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల చెరువులో ఆక్రమణల తొలగింపు



చెరువులో వేసిన కరకట్టలను తొలగిస్తున్న దృశ్యం

కొణిజర్ల, జనవరి28(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ కొణిజర్ల మండలంలోని లాలాపురం గ్రామంలో తుమ్మల చెరువులో ఆ గ్రామానికి చెందిన ఓ రైతు అక్రమంగా చేపల కోసం కట్టలు పోశాడన్న నేపథ్యంలో అధికారులు వాటిని తొలగించేందుకు సోమవారం వెళ్లారు. దీంతో సదరు రైతు దంపతులు తొలగింపునకు అడ్డుపడ్డారు. ఆయకట్టు రైతులు కూడా సదరు రైతు చెరువును ఆక్రమించి చేపల పోశాడని తొలగించాలని రోడ్డుపై ఆందోళన చేశారు. సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి రైతును, అధికారులను స్టేషన్‌కు పిలిపించారు. అధికారులు తొలగించేందుకు తమకు ఆధారాలు ఉన్నాయని చూపారు. దాంతో సీఐ, ఎస్ఐ అధికారులకు అడ్డుపడటం సరైందికాదని చెరువు పట్ల ఉన్న ఆధారాలను చూపాలని, అప్పటి వరకు అధికారులు పని అధికారులను చేసుకోనివ్వమని సూచించారు. స్టేషన్ నుంచి రైతు వెళ్లిపోయాడు. ఇరిగేషన్ ఏఈ నాగేంద్రకుమార్, ఇతర శాఖల అధికారులు వెంటనే రైతు చెరువులో ఏర్పాటు చేసిన కట్టలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడేనికి చెందిన నాగండ్ల శ్రీనివాసరావుకి చెల్లని చెక్కు చేసులో ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి నష్ట పరిహారం కింద రూ.9లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పుచెప్పారు. ఖమ్మం నగరం లెనిన్‌నగర్‌కు చెందిన ఫిర్యాది దొడ్డ రమేష్ వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2016లో రూ.ఆరు లక్షలను అప్పుగా తీసుకొని అదేరోజు ప్రాంసరీనోటు రాసి ఫిర్యాదుకు ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని అడగగా ఫిర్యాదికి నిందితుడు 2017లో రూ.ఆరు లక్షలకు చెక్కు జారీ చేసినాడు. చెక్కును ఫిర్యాది తన బ్యాంకుఖాతాలో జమచేయగా చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది నల్లమల నవీన్‌చైతన్య ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో ప్రయివేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు.

మరో కేసులో....

ఆంధ్రపదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా నందిగామ మండలానికి చెందిన అట్లూరి సుబ్రహ్మణ్యేశ్వరావుకు చెల్లని చెక్కు చేసులో ఆరు నెలల జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి నష్టపరిహారం కింద రూ.9లక్షలు చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప మంగళవారం తీర్పుచెపారు. కేసు వివరాలు.. ఖమ్మం నగరం సహకారనగర్‌కు చెందిన ఫిర్యాది చింతలపూడి శరత్‌బాబు వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2018లో ఏడు లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని, అదేరోజు ప్రాంసరీనోటు రాసి ఫిర్యాదుకు ఇచ్చినాడు. తరువాత ఫిర్యాది తన రుణం తిరిగి చెల్లించమని వత్తిడి చేయగా ఫిర్యాదికి నిందితుడు 2019లో ఆరు లక్షల రూపాయలకు చెక్కుజారీ చేసినాడు. చెక్కును ఫిర్యాది తన బ్యాంకుఖాతాలో జమచేయగా బ్యాంకు వారు స్టాప్ ది పేమెంట్ గా మెమో జారీచేశారు. ఫిర్యాది తన న్యాయవాది దండా సుధాకర్‌రావు ద్వారా లీగల్ నోటీ సు జారీచేసి కోర్టులో ప్రయివేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో శిక్షవిధిస్తూ తీర్పుచెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చంద్రుగొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పనపల్లి గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ శివరామకృష్ణ తన సిబ్బందితో కలిసి స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.5,160, మూడు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవో 317 టీచర్ల కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

తల్లాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవోనెంబర్ 317 స్పౌజ్ టీచర్ల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో 317వల్ల ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయుల భర్త, భార్య పనిచేస్తున్న జిల్లాకు వెనక్కి పంపించటానికి ప్రభుత్వం స్పౌజ్ గ్రౌండ్స్‌లో అవకాశం కల్పించినప్పటికీ డీఈవో స్పౌజ్ టీచర్ల వివరాలు, పాఠశాల లిస్టు విడుదల చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఇనియానిల్‌రాజు, ఫ్రాన్సిస్, ఉషారాణి, రమాదేవి, డి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజం కోసం పాటుపడాలి

- టీజీ యాంటీ నార్కోటిస్ డీఎస్పీ మధు మోహన్‌రెడ్డి



పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీస్ అధికారులు

సుజాతనగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మాదకద్రవ్య రహిత సమాజం కోసం పాటుపడాలని తెలంగాణ యాంటీ నార్కోటిస్ బ్యూరో (టీజీనాబ్)డీఎస్పీ కె. మధు మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం- మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే అంశంపై స్థానిక అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా తన జీవిత లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యసనంగా మారితే జరిగే దుష్పరిణామాలు, సమాజంలో వారికి కలిగే నష్టాలను గురించి వివరించండం జరిగింది. మాదకద్రవ్యాలను వినియోగించినా, రవాణా చేసినా చట్ట పరంగా జరిగే చర్యలు చాలా కఠినంగా ఉన్నాయని, వాటి గురించి తెలిపారు. రాష్టంలో మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగా ఉందని అందువలన ప్రతి ఒక్కరూ మాదకద్రవ్య రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. మన ప్రాంతంలోగాని, ప్రదేశాలలో కాని వాటిని వినియోగించే వారున్నా వారిని పిలిపించి వారికి అవగాహన కల్పించి వాటి బారిన బడకుండా కాపాడిన వారం అవుతామని, మాదకద్రవ్య రహిత సమాజం కోసం కృషి చేసిన వారం అవుతామన్నారు. ఎవరికైనా మాదకద్రవ్యాల వినియోగం, రవాణా గురించి సమాచారం తెలిసినా 1908కి ఫోన్ చేసి సమాచారం తెలపాలని, సమాచారం అందించిన వారికి నగదు బహుమతితో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల యాంటీ నార్కోటిస్ సీఐ విజయ్‌కుమార్, సుజాతనగర్ ఎస్ఐ ఎం.రమాదేవి, సిబ్బంది, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



తిరుమలాయపాలెం,జనవరి28(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ గిరిజన బాలికల వసతిగృహం విద్యార్థులకు మంగళవారం వసతిగృహ సంక్షేమాధికారి పూలన్‌దేవి పంపిణీ చేశారు. విద్యార్థులు ప్రభుత్వ వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	34
బెండకాయ	44
బెండకాయ	38
పొట్లకాయ	48
దోసకాయ	34-44
చిక్కుడు	48
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	34
క్యాబేజీ	20
దొండ	44-50
సొరకాయ	18
క్యారెట్	28
క్యాప్సికం	38
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	155
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	గేంచేంజర్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పుష్ప 2
కేపీఎస్:	హాంకాంగ్ వారియర్స్
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభం

- సాగుకు నాలుగేళ్లు ప్రభుత్వ సబ్సిడీలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- చింతగుర్తిలో క్షేత్రస్థాయిలో పంట పరిశీలన



పామాయిల్ తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

రఘునాథపాలెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభదాయక వ్యవసాయం జరుగుతుందని, పామాయిల్ సాగు చేసిన నాటినుంచి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వం నుంచి అనేక విధాలుగా సబ్సిడీలు అందుతాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో పామాయిల్ సాగును క్షేత్రస్థాయిలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. నీటి వనరుల లభ్యతను తెలుసుకున్నారు. గతంలో ఎటువంటి పంటలు సాగుచేశారు. ఇప్పుడు సాగులో ఏఏ పంటలు ఉన్నాయని ఆరా తీశారు. అంతర్ పంటల ఉపయోగాలుపై తెలుసుకున్నారు. పామాయిల్ సాగుపై రైతులకు సహకరించేందుకు ప్రభుత్వ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రభుత్వం నుంచి మొక్కల కొనుగోలు, డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ అందుతుందన్నారు. నాల్గవ సంవత్సరం నుంచి పామాయిల్ దిగుబడి ఆదాయం వస్తుందని ఏడోసంవత్సరం నుంచి పూర్తిస్థాయి పంట అందుతుందన్నారు. భవిష్యత్‌లో పామాయిల్ రైతులకు మరింతగా సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం కార్యచరణ చేస్తోందని తెలిపారు. కాగా చింతగుర్తి చెర్వు శిఖం భూములు కబ్జాకు గురయ్యారని రైతులు ఫిర్యాదు చేయగా విచారణ చేయాలని, 15లోగా నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

భక్త రామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

ఖమ్మంకలెక్టరేట్: ఖమ్మం నగరంలో సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా ఉన్న భక్తరామదాసు కళాక్షేత్రాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఆయన నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రాన్ని సందర్శించి ఆధునికీకరణ పనులను పరిశీలించారు. కళాక్షేత్రంలో ఇంటీరియర్ మరింత ఆకర్షణీయంగా తయారుచేయాలన్నారు. సైడ్‌ఫ్యాన్లు తొలగించి, ఏసీ ఏర్పాటు చేయాలన్నారు. వెనుక ఉన్న ప్రేక్షకులకు డయాస్ స్పష్టంగా కనిపించేలా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కళాక్షేత్రం సౌండ్ ప్రూఫ్, లోపల ఆడియో వ్యవస్థ పక్కాగా ఉండేలా చూడాలని అన్నారు. కళాక్షేత్రంలో ముందు సీట్లలో కూర్చునే ప్రేక్షకులకు ఇబ్బంది కలగకుండా లైటింగ్ ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ పరిశీలన సందర్భంగా పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఈ మహేష్ తదితరులు ఉన్నారు.

ఇసుక, రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

కూసుమంచి సీఐ సంజీవ్

తిరుమలాయపాలెం, జనవరి28(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను, రేషన్‌బియ్యం తరలిస్తే పోలీసుశాఖ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కూసుమంచి సీఐ సంజీవ్ తెలిపారు. మంగళవారం తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు ఈసందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. నేరాలకు సంబంధించిన రికార్డులు కూడా పరిశీలించారు. కూసుమంచి సర్కిల్ పరిధిలో ఇసుక, రేషన్‌బియ్యం అక్రమరవాణ జరగకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అక్రమరవాణ చేసేవారిపై కేసులు నమోదుచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులకు అన్నిరాజకీయ పక్షాలు సహకరించాలన్నారు. కొత్త వ్యక్తులు అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా సైబర్‌నేరాల సంఖ్య పెరుగుతందన్నారు. వారి మోసాలకు గురికావద్దని సీఐ సంజీవ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కూసుపుడి జగదీష్ పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ప్రతులను దహనం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికశాఖ జనవరి 26న యూనిఫైడ్ విధానం(యూపీఎస్)పై జారీచేసిన నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మంగళవారం గెజిట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబ సామాజిక భద్రత కోణం లేదని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ విధానం ఉద్యోగికి ఎటువంటి ఆర్థిక భద్రత చేకూర్చదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోకి ఆ విధానాన్ని అనుమతించకుండా మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పాతపెన్షన్ పునరద్ధరణకు చర్యలు చేపట్టాలని చంద్రకంటి శశిధర్ అన్నారు. నగరంలోని డైట్ కళాశాలలో గెజిట్ పతులను దహనం చేశారు.

మంత్రివర్గంలో యాదవులకు స్థానం కల్పించాలి

- యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు కూరాకుల



మాట్లాడుతున్న నాగభూషణం యాదవ్

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రజనాభాలో 19శాతంగా ఉన్న యాదవులకు ఎమ్మెల్సీ పదవి కేటాయించి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని తెలంగాణ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు , మాజీ డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఖమ్మం సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గొర్రెల సొసైటీకి కేటాయించిన భూమిని ఇతర అవసరాల కోసం కేటాయించారని, అట్టి భూమిని సొసైటీకి అప్పగించాలని కోరారు.ఖమ్మంపట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో 35శాతంపైబడి ఉన్న యాదవులకు సుడాచైర్మన్ పదవి కేటాయించాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి గుమ్మా రోశయ్యయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బారీ మల్సూర్ యాదవ్, చిత్తారు ఇందుమతి యాదవ్, బట్టు షరాబంద్ యాదవ్, కోడి లింగయ్య యాదవ్, కొప్పుల నర్సింహారావుయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



ఖమ్మంక్రైం, జనవరి28(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థిని కాలేజీ ఫీజు కట్టేందుకు కొంతమంది దాతలు నగదు అందించారు. తల్లాడ మండలం తెలగారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని వారాల అంబిక హైదరాబాదులోని ఒకళాశాలలో ఇంజనీరింగ్ చదువుతుంది. ఖమ్మంజిల్లాలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు రూ.30 వేలు, మాస్ సంఘం నుంచి రూ.10వేల నగదును మంగళవారం నగరంలో విద్యార్థినికి నగదు అందించారు. ఈకార్యక్రమంలో నరసయ్య, మంగలపుడి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో తెల్లూరి శ్రీనివాసరావు, మోహన్‌రావు, త్రీటౌన్ ఏఎస్‌ఐ మడిపల్లి బాబు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్,జనవరి28(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణకు యువత దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌కు చెందిన సెట్విన్ సంస్థ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వనుందని తెలిపారు. ఫిబ్రవరి1 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఇవ్వడానికి, ఇతర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని సెట్కం కార్యాలయంలో నేరుగా, 9948207271 ద్వారా సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి

ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్



మాట్లాడుతున్న వెంకటేష్

ఖమ్మంరూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలని ఐడీబీఐ (ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ బ్యాంక్ఆఫ్ ఇండియా)జనరల్ మేనేజర్ వెంకటేష్ అన్నారు. మండల పరిధిలోని ఏదులాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బ్యాంక్ ఆధ్వర్యంలో 8కంప్యూటర్లు, 1ఇన్వర్టర్‌ను వితరణగా మంగళవారం అందజేశారు. విద్యార్థిదశ అనేది ఎంతోముఖ్యమైనదని క్రమశిక్షణతో కూడిన జీవిత ఎదుగుదలకు సోపానంగా నిలుస్తుందన్నారు. మున్ముందు కూడా పాఠశాలకు సహకారాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దండి సురేష్, ప్రధానోపాధ్యాయులు శివకుమారి, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి28(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన ఖమ్మం నగర నాయీబ్రాహ్మణ సంఘం ప్రమాణస్వీకారానికి హాజరు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిని ఆ సంఘం నాయకులు మంగళవారం హైదరాబాదులోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం దిశగా అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారంలో జరిగే సంఘం నగర కమిటీ ప్రమాణస్వీకారానికి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నగర కార్యదర్శి గుండ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

31న మాంట్‌ఫోర్ట్ పాఠశాల డైమండ్ జూబ్లీ ఉత్సవాలు

ఖమ్మంఖానాపురంహవేలి, జనవరి27(ఆంధ్రజ్యోతి): నగరంలోని మాంట్‌ఫోర్ట్ పాఠశాలలో శుక్రవారం డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కల్పనాబాయి హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్ల శ్రేణిలో చరిత్ర సృష్టించనున్న క్రెటా

- భారత్ గ్రూప్ కంపెనీస్ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్



వాహనాన్ని ప్రారంభిస్తున్న భారత్ గ్రూప్ కంపెనీస్ చైర్మన్ సుభాస్‌చంద్రబోస్

ఖమ్మంసంక్షేమ విభాగం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌వాహనాల శ్రేణిలోకి హుండాయ్ క్రెటా తిరుగులేని మార్కెట్‌ను దక్కించుకుంటుదని భారత్ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. మంగళవారంఖమ్మంలోని హుండాయ్ షోరూమ్‌లో నూతన క్రెటా విద్యుత్ కారును ఆయన ప్రారంభించారు. ఒక్కసారి కారుచార్జింగ్ చేస్తూ 42కిలోవాట్స్ బ్యాటరీ సామర్థ్యంతో 390కిమీ వరకు ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు లింగస్వామి, యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజరు హనుమంతరెడ్డి,భారత్ హుండాయ్ సీఈవో ఎస్.కృష్ణ, పాల్గొన్నారు.

మార్కెట్ కార్యదర్శిపై దాడికి నిరసన

ఖమ్మంమార్కెట్,జనవరి28(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో రెండు రోజుల క్రితం మార్కెట్ సెక్రెటరీ నర్సింహ, ఛైర్‌పర్సన్ భర్త మల్లేశంపై పల్లీ రైతుల దాడిని ఖండిస్తూ నగరంలోని వ్యవసాయ మార్కెట్ సిబ్బంది మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సు కోసం పని చేసే సిబ్బందిపై చేయి చేసుకోవడం సరైంది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ గ్రేడ్‌టూ సెక్రెటరీ సృజన్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు, సూపర్‌వైజర్లు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, షర్మిల, నిర్మల, నాగమణి, గౌసియా, యాడీసీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కామేపల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నెకల్ గ్రామం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక కావడంతో ఆగ్రామంలో రైతుభరోసా, రైతుఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషనకార్డులు మంజూరు కావడంతో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామ రైతులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భటి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాలం గడిపారని అన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, డీఎస్, నల్లమోతు లక్ష్మయ్య, గుజ్జర్లపుడి రాంబాబు, మద్దినేని రమేష్, సరిరాం, లక్ష్మణ్, వరికొల్లు సైదులు, ప్రేమ్, దొడ్ల వేణు, బావ్‌సింగ్, అశోక్, వెంకటరెడ్డి, దారావత్ అనురాధ, సులోచన, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముంపు బాధితుల సహాయానికి దక్కిన గౌరవం

- 35మందికి మరోసారి ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరదల సమయంలో ఖమ్మం నగర పాలక సంస్థ ఉద్యోగులు అండగా నిలిచారు. డీఆర్ఎఫ్, పారిశుధ్య కార్మికులు, మెప్మా సీవోలు, ఆర్పీలు వరద నీటిలో సహాయ చర్యలు చేపట్టారు. వారం రోజుల్లో మున్నేరు ముంపు ప్రభావిత ప్రాంతాన్ని సాధారణ స్థాయిలోకి తీసుకొచ్చారు. అయితే జనవరి 26న ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ప్రశంస పత్రాల పంపిణీలో ఆ సమయంలో కష్టపడిన వారికి ప్రశాంసపత్రాలు అందలేదు. దీతో ఈనెల 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మున్నేరు కష్టానికి ఏదీ గుర్తింపు' కథనంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్యను పిలిపించి ప్రశంస పత్రాలు పంపిణీపై వివరణ కోరారు.మున్నేరు బాధితులకు అండగా నిలిచిన వారికి ప్రశంసా పత్రాలు అందాలని ఆదేశించారు. దీంతో మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో 35మందికి మరోసారి ప్రశంస పత్రాలను అందించారు. ఈసందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగులుకు, కార్మికులకు సరైన గౌరవం దక్కుతుందన్నారు. పని చేసిన వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆర్వో శ్రీనివాసరావు, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య పాల్గొన్నారు.

డివైడర్ల క్లీనింగ్‌పై స్పెషల్ డ్రైవ్

- మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ నగరంలో పర్యటిస్తూ సూచనలు
- 10వ డివిజన్‌లో అలుగు పరిశీలన
- 44వ డివిజన్‌లో రైతు మార్కెట్ నిర్మాణంపై సూచనలు
- పారిశుధ్య కార్మికులతో కలిసి భోజనం





రైతుమార్కెట్ పనులు పరిశీలిస్తున్న మేయర్, కార్పొరేటర్, పారిశుధ్య కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న మేయర్, కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ఖమ్మం నగరం సుందరీకరణపై కేఎంసీ పాలకవర్గం దృష్టి సారించింది. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వరస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీశ్రీ సర్కిల్ నుంచి రాపర్తినగర్ సెంటర్ వరకు చేపట్టిన డివైడర్ల స్పెషల్ క్లినింగ్ పనులను నిర్వహించారు. కేఎంసీ పారిశుధ్య విభాగం నుంచి 120 మంది కార్మికులు, ఉద్యాన విభాగం నుంచి 50మంది కార్మికులు, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు ఆరుగురు పారిశుధ్య పనులు నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య డివైడర్లను పరిశీలిస్తూ సూచనలు చేశారు. అనంతరం 10వ డివిజన్‌లో నివాసాల మధ్య తనిఖీలు చేశారు. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు పెరగటంపై జవాన్‌ను కమిషనర్ అభిషేక్ మందలించారు. ఖాళీప్రదేశాల యజమానులకు రూ.5వేలు జరిమాన విధించాలని ఆదేశించారు. డ్రేనేజీలను రోజు శుభ్రం చేయించాలని హెచ్చరించారు. ఖానాపురం నుంచి ప్రవహిస్తున్న అలుగును పరిశీలించారు. త్వరలో జరగబోయే అలుగు అభివృద్ధి నిర్మాణ పనులపై కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజకు వివరించారు. అనంతరం 44వ డివిజన్‌లో నిర్మాణం జరుగుతున్న రైతు బజార్‌ను మేయర్ పునుకొల్లు నీరజ కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణతో కలిసి పరిశీలించారు. నాణ్యంగా రైతులకు ఉపయోగపడేలా నిర్మాణాలు జరపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. త్వరిగ గతిన పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. అనంతరం ఖమ్మం డిగ్రీ కాలేజీలో స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న పారిశుధ్య కార్మికులకు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ స్వయంగా భోజనాలు వడ్డించారు. వారితో కలిసి భోజనాలు చేశారు. పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏఎంసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మార్కెట్ కమిటీ కార్యదర్శిపై జరిగిన దాడిని ఖండిస్తూ కల్లూరులో మంగళవారం ఏఎంసీ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ కార్యదర్శి, చైర్మన్‌లతో పాటుగా కార్యాలయం ధ్వంసం, దాడి చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్ కుమార్, సాత్విక, సంపత్, నరేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పార్కులు..



ఓపెన్ జిమ్‌పై పడవేసిన చెట్లు

- విరిగిపోయిన ఆట వస్తువులు
- పట్టించుకోని అధికారులు
- పార్కులను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల వినతి

మధిరటౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పార్కులు ఎవరికీ ఉపయోగపడకుండా తయారయ్యాయి. దీంతో ఆహ్లాదం కాస్తా అధ్వానంగా మారింది. మధిర పట్టణంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఒక్క



సుందరయ్యనగర్ పార్క్‌లో విరిగిన ఊయల

పార్కు కూడా లేదు. ఒక్క రైల్వే స్టేషన్‌లో మాత్రమే రైల్వే క్వార్టర్లకు ఎదురుగా రైల్వే ఉద్యోగుల పిల్లలు ఆడుకునేందుకు మాత్రమే ఆ పార్కు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక మధిరలోని సుందరయ్యనగర్‌లో రూ.40లక్షలతో ఓ పార్కు, ఎస్సీ కాలనీలో రూ.60లక్షల తో మరో పార్కు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసి 2021వ సంవత్సరంలో ప్రారంభించారు. ప్రారంభించిన ఏడాది వరకు బాగానే పార్కులను మునిసిపాలిటీ నిర్వహణ చేసినా తరువాత వాటి ఆలనా పాలన మరచి పోయా రు. దీంతో సంవత్సరం క్రితం ఈ రెండు పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు ఊయ్యాలలు, రంగులరాట్నాలు విరిగి పడి పోయాయి, పార్కులో పచ్చికను పెంచేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు కూడా చెడిపోవడంతో పచ్చిక కాస్తా ఎండిపోయి కళాహీనంగా దర్శనమిస్తుంది. పార్కుల్లో పెరిగిన చెట్లను మునిసిపల్ సిబ్బంది నరికి మొద్దులను అక్కడే వదిలేశారు. నరికిన మొద్దులు ఓపెన్ జిమ్ పై పడిన వాటిని కూడా కనీసం తీయలేదు. మునిసిపల్ అధికారులు నిర్వహణను పూర్తిగా మరిచిపోవడంతో పిల్లలకు పెద్దలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అధ్వానంగా తయారయ్యాయి, మునిసిపల్ అధికారులు ఇప్పటికైన పార్కుల నిర్వహణ పై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

దీనిపై మునిసిపల్ మేనేజర్ ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా గతంలో పార్కుల్లో వేసిన కానోకార్పస్ మొక్కలు పెరగడంతో వాటిని తొలగించామని, పార్కుల్లో ఉన్న మొద్దులను తొలగిస్తామని తెలిపారు. పార్క్‌ల నిర్వహణ పై శ్రద్ధ పెడతాం అన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని వినతి

వైరా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి వెంటనే నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. సచివాలయంలో మంగళవారం రాత్రి సీఎంని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దావోస్‌లో రూ.1.78లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూలకు ఒప్పందాలు చేసుకున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సందర్భంలో వైరా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల గురించి సీ ఎంకు వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేయాలని, అవసరమైన ఆదేశాలు వెంటనే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, నర్వనేని అశోక్, మంజుల, కృష్ణ తదితరులు ఎమ్మెల్యేతో ఉన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వైరా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలో మంగళవారం రాత్రి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగ ఇతర సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అతర్వాత కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇచ్చిన కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తె లిపారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, పమ్మి తిరుమలరావు, పూర్ణకంటి రామారావు, కన్నెగంటి హుస్సేన్, తోటపల్లి కృష్ణ, తిరుమలరావు, రవి, వెంకట్, వెంకటేశ్వర్లు, నల్లగట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

సత్తుపల్లిరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ద్వారకాపూరి 7వ లైన్‌లో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి మంగళవారం స్థానిక ఆకర్షణ జ్యువెలరీస్ నిర్వాహకులు రూ.58,116నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కనిగోళ్ల గోపాలకృష్ణ, లక్ష్మీతాయారు, వినయ్‌కుమార్, వరలక్ష్మీలను స్వామివారి శేషవస్త్రాలతో దేవాలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ సన్మానించారు.

టీడీపీ బలోపేతం కోసం కృషి చేయాలి

బోనకల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ సూచించారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో మంగళవారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను నిర్వహించారు. సభ్యత్వ నమోదు ద్వారా ప్రమాద బీమా రూ. 5లక్షల వరకు ఉందని తెలిపారు. సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షైనేని రవి కుమార్, కన్నెపోగు రవీంద్ర, బలవంతపు చిన కనకరత్నం, విశ్వనాథం, బాబురావు, షేక్ ఖాసీం, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

బోనకల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేబ్రోలు వెంకటేశ్వర్లు ఖండించారు. బోనకల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నిరంతర ప్రక్రియగా అమలు చేస్తామని చెప్పినా, కేవలం ఉనికి కోసం ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల నిధులతో డిప్యూటీ సీఎం భట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని మానుకోవాలని హితవు పలికారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎస్ఐ

కారేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ రాజారాం, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడి తిరుపతిరావులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కామ్రేడ్ యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన మూడు మండలాల స్థాయి కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రథమ బహుమతిని మండల కేంద్రానికి చెందిన జట్టు గెలుపొందగా, రెండవ బహుమతి గార్ల మండలానికి చెందిన జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో మల్లెల నాగేశ్వరరావు, తోగర శ్రీను, వినయ్, అనిల్, దిలీఫ్ తదితరులున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

తల్లాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం తెలగవరం గ్రామానికి చెందిన నిరుపేద బీటెక్ విద్యార్థిని వారాల అంబికకు దాతలు రూ.40వేల ఆర్థికసహాయాన్ని మంగళవారం అందజేశారు. అంబిక హాస్టల్ వసతి కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని మాస్ నిధి నుంచి రూ.పది వేలు, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తేల్లూరి శ్రీనివాసరావు ద్వారా మరో రూ.30వేలు కలిపి మొత్తం రూ.40వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జలవరులశాఖ ఎస్ఈ మంగపూడి వెంకటేశ్వర్లు, ఐవోబీ నర్సయ్య, మోహన్‌రావు, మడిపల్లి బాబు, వారాల శ్రీనివాసరావు, ఎక్కిరాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎన్యూమరేటర్లకు వెంటనే బకాయిలు చెల్లించాలి'

కారేపల్లి, జనవరి28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీజీ టీటీఎఫ్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను ఎన్యూమరేటర్లు ఎంతో కష్టపడి పని చేశారని, వారికి ఇవ్వాల్సిన బిల్లులు త్వరగా ఇవ్వాలని కోరారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థి ఎంపిక

మధిరటౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు భరత్ స్కూల్‌కు చెందిన 5వ తరగతి విద్యార్థి యస్.కె. అర్బాజ్ ఎంపికైనట్లు భరత్ విద్యాసంస్థల చైర్మన్ శీలం వెంకటరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థిని మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు, ఇటీవల ఖమ్మంలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విద్యాలత, పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, డీన్ కటికల రవీందర్‌రెడ్డి, అబాకస్ ట్రైనర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

సఖీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏన్కూరు, జనవరి28(ఆంధ్రజ్యోతి): చిన్నారులు, యువతీ, యువకులు వృద్ధులు ఎటువంటి ఆపదున్నా వెంటనే సఖీ కేంద్రాలను ఆశ్రయించాలని సఖీ సోషల్ కో ఆర్డినేటర్ అరుణశ్రీ తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గురుకల పాఠశాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశలా, హరిజనవాడ పాఠశాల, గుడ్‌న్యూస్‌పాఠశాలలో చిన్నారి ప్రోగ్రాంను నిర్వహించారు. ఆపద కలిగిన వారు 1098 హెల్ప్‌లైన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీ సునీల్, స్టాఫ్ నర్సు శారా స్వప్న, సుమలత, ప్రతిభాభారతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కొణిజర్ల, జనవరి28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లాలాపురం గ్రామంలో కట్టా దేవిశ్రీ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారి ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్లూరు ఎంపీవో సురేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు షేక్ సుభాని, బీజేపీ నాయకులు ఏనుగు సుమన్, సంస్థ అధ్యక్షుడు మాలతీ దాస్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

» ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ దయానంద్



విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దయానంద్

సత్తుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని దానిని సద్వినియోగం చేసుకుంటేనే విద్యార్థులు అభివృద్ధి చెందుతారని ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మంగళవారం స్థానిక జేవీఆర్ కళాశాలలో జరిగిన నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజంలో మొదటి శత్రువు సెల్‌ఫోన్‌గా మారిందని, దీనివలన మానవ సంబంధాలు కూడా లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ద్వారా స్థానిక ప్రభుత్వ కళాశాలను ఇప్పటికే రూ.లక్ష చొప్పున అందజేశామని, రానున్న నాలుగేళ్లలో కూడా రూ.లక్ష చొప్పున అందజేసి మొత్తం రూ.5లక్షలు డిపాజిట్ చేసి విద్యార్థుల కోసం ఖర్చు చేస్తామన్నారు. వచ్చే ఏడాదికి జేవీఆర్ కళాశాలలో నాలెడ్జ్ ఎక్స్‌పో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా ఈ కళాశాలలో జరిగే క్రీడా,సాంస్కృతిక పోటీలతో పాటు నాలెడ్జ్ ఎక్స్‌పోకు అయ్యే ఖర్చు భరిస్తామన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల భవనాలు నూతనంగా ఈ ఏడాదే నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎస్.గోపి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలలోని విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆత్మ' కమిటీ చైర్మన్‌గా రామకోటేశ్వరరావు



బోనకల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయనపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుత కలకోట సొసైటీ అధ్యక్షుడిగా పని చేస్తున్న కర్నాటి రామకోటేశ్వరరావు నియోజకవర్గ స్థాయి ఆత్మ(అగ్రికల్చరర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ)కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడు కావడంతో పాటు పార్టీకి విధేయుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. గత 30 ఏళ్లుగా మండల కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయడంతో పాటు పలు పార్టీ పదవులను చేపట్టి అందరి మన్ననలను అందుకున్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న భట్టీతో మాట్లాడి రాయనపేట, కలకోట గ్రామాల్లోని రైతుల భూములకు పుష్కలంగా నీరందించే విధంగా రూ.9కోట్ల నిధుల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. గతంలో ఒకసారి రాయనపేట వాసికి ఇదే పదవి ఇవ్వగా మరోసారి ప్రాధాన్యత కల్పించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మ కమిటీ మెంబర్లుగా కందుల పాపారావు, షేక్ దస్తగిరి, నల్లమోతు సత్యనారాయణలు నియమితులయ్యారు. నూతన చైర్మన్, కమిటీ సభ్యులకు పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, డీసీసీ జిల్లా కార్యదర్శి బందం నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, నర్సయ్యశాస్త్రి, బీపీ నాయక్‌లు శుభాకాంక్షలు తెలిపారు. పదవులు ఇచ్చిన భట్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

» జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్



మాట్లాడుతున్న మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

బోనకల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ ఆరోపించారు. మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకాల అమలుకు మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానించడాన్ని తప్పుబట్టారు. మధిర నియోజకవర్గంలో గత 2021లో ఎమ్మెల్యే భట్టి చేతుల మీదుగానే ప్రభుత్వం రేషన్ కార్డులను పంపిణీ చేసిన విషయం గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఐదు గ్రామాల్లో అమలు చేయడానికి ఏడాదిన్నర కాలం పట్టిందని, నియోజకవర్గంలోని మిగిలిన 129 గ్రామాల్లో అమలు చేయడానికి ఇంకా ఎన్ని సంవత్సరాల కాలం పడుతుందో వారికే తెలియాలని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బందం శ్రీనివాసరావు, మల్లికార్జున్, మోదుగుల నాగేశ్వరరావు, కొనకంచి నాగరాజు, కొమ్మినేని ఉపేందర్, పారా ప్రసాద్, తన్నీరు పుల్లారావు, జేడీ మూర్తి తదితరులున్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి: సీపీఐ



మాట్లాడుతున్న హేమంతరావు

కొణిజర్ల, జనవరి28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించినందుకు ప్రజలు ఓడించారని, కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలు ఆశపెట్టుకొని గెలిపించారని, ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేయాలని సీపీఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు కోరారు. మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో జరిగిన యాసా శ్రీను వర్ధంతిసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, కంపసాటి వెంకన్న, గుగులోతు శ్రీను, శోభన్ పాల్గొన్నారు.

దేవాలయంలో అన్నదానం

మధిరటౌన్, జనవరి28(ఆంధ్రజ్యోతి): మధిర వర్తక సంఘం కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి అనుబంధంగా ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే ఆత్కూరు ఆంజనేయ స్వామి దేవాలయంలో కూడా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కపిలవాయి జగన్మోహన్‌రావు, వెచ్చా శ్రీనివాసరావు, వెలగపూడి పూర్ణ, దాలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



విరాళం ఇచ్చిన దాతలు

తల్లాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో పురాతనమైన మల్లికార్జునస్వామి దేవాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త బోనం ప్రేమ్ కుమార్ కుటుంబసభ్యులు భారీగా విరాళం అందజేశారు. ప్రేమ్‌కుమార్, అనిత దంపతులు వారి కు మారుడు జయకీర్తన రూ.6,0,116 విరాళంగా అందజేశారు. వీరు అందించిన విరాళంతో ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ప్రహరీ నిర్మాణానికి విరాళం ఇచ్చిన ప్రేమ్‌కుమార్ కుటుంబసభ్యులకు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తలూరి నర్సింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తలూరి కుటుంబానికి పరామర్శ



వీరమ్మ, రాజా చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మోహన్‌రెడ్డి

సత్తుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన చిత్తలూరి వీరమ్మ, రాజా కుటుంబాన్ని మాజీ శాసనమండలి సభ్యుడు, పీఆర్టీయూ సీనియర్ నాయకుడు బీ.మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు పీఆర్టీయూ అధికార మాసపత్రిక ఉపసంపాదకుడు చిత్తలూరి ప్రసాద్ స్వగృహంలో పరామర్శించి రాజా, వీరమ్మల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహ్మద్ రియాజుద్దీన్, షైలమాల అబ్రహాం, గార్లపాటి రామకృష్ణ, మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్లకు స్థల సేకరణ

ఏన్కూరు, జనవరి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకాలంపాడు, లచ్చగూడెం గ్రామాల్లో సోలార్‌ప్లాంట్ల ఏర్పాటుకు అధికారులు స్థల సేకరణ చేపట్టారు. పీఎంకుసుమ్ పథకం ద్వారా డ్వాక్రా మహిళ సంఘాలతో ఏర్పాటు చేయనున్నట్లు రెడ్‌కో మేనేజర్ అజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, విద్యుత్ ఏఈ ఉమాకాంత్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఎం.వెంకటరామారావు, కమిటీ సభ్యులు జరపల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు..



స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు



బ్రిడ్జి నిర్మించనున్న పెద్దవాగు

బోనకల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబీరవల్లి వద్ద గల పెద్ద వాగు వంతెన కిందకు ఉండటంతో వానాకాలం సీజన్‌లో ప్రజల రాకపోకలు నిలిచిపోయేవి. దశాబ్దాల తరబడి ఈ వంతెన వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క సమస్యను గుర్తించి వాగు పై బ్రిడ్జితో పాటు ఈ మార్గంలో బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయడంతో ప్రజల చిరకాల వాంచ నెరవేరినట్లైంది. పీడబ్ల్యూ రహదారి నుంచి చిన్నబీరవల్లి మీదు గా నారాయణపురం వరకు గల రోడ్డుకు బీటీ తో పాటు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 4.50 కోట్లు, రావినూతల నుంచి గోవిందాపురం మీదుగా పెద్దబీరవల్లి గ్రామం వరకు గల 3కిలోమీటర్ల దూరం రోడ్డుకు రూ.2.80 కోట్లు, గార్లపాడు నుంచి రామాపురం మీదుగా నాగులవంచ వర కు గల 4కిలోమీటర్ల దూరం రోడ్డుకు బీటీ వేసేందుకు గానూ రూ.2.23 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. తమ చిరకాల వాం చగా ఉన్న బ్రిడ్జి, రోడ్లు వేసేందుకు డిప్యూటీ సీఎం భట్టీ నిధులు మంజూరు చేసినందుకు గానూ కాంగ్రెస్ నాయకులు చంద్ర శ్రీనివాసరావు, కొప్పుల పెద్ద కాంతయ్య, నర్సింహారావు, నాగేశ్వరరావు, వినయ్, కోటయ్య, నల్లమోతు సత్యనారాయణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కొణిజర్ల, జనవరి28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాలుగు పథకాల అమలులో భాగంగా రైతులకు ఇచ్చిన రైతు భరోసా వాగ్దానం అమలు అయింది. దాంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు ఆధ్వర్యంలో రైతులు, నాయకులు మంగళవారం చిన్నగోపతి గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లుభట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చిన్నగోపతి, పెద్దగోపతి రెవెన్యూ గ్రామాలలో 3,816 ఎకరాలకు గాను రూ. 2,29,93,195లు నగదు రైతు ఖాతాల్లో జమ అయింది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ నాలుగు పథకాల అమలులో భాగంగా చిన్నగోపతి గ్రామంలో ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అర్హులైన రైతులందరికీ రైతు భరోసా వస్తుందని హామి ఇచ్చారని, చెప్పిన విధంగా ఒక్కరోజులోనే రైతు భరోసా రైతుఖాతాల్లో జమ అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లమోతు భద్రయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, ముత్తయ్య, జిల్లా మహేష్, కాటయ్య, అన్నమయ్య, ఆదినారాయణ, నాగేశ్వరరావు, నగేష్, ఏకేశ్వరరావు పాల్గొన్నారు.



సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

రామగోవిందాపురం, కిష్టాపురంలో కళాజాత

సత్తుపల్లిరూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై రామగోవిందాపురం, కిష్టాపురంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాజాత నిర్వహించారు. పోలూరి రాము కళాజాత బృందంచే గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలు, పౌష్టికాహారం, టీకాలు, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గంగారం పీహెచ్‌సీ వైద్యుడు ఏ.అవినాష్, హెచ్‌ఈ వేణుగోపాల్, హెచ్‌ఈవో వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ దాసరి శ్రీను, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మసంఘాల సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ

వైరా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో మంగళవారం కమ్మసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమాఖ్య చేపట్టే సేవ కార్యక్రమాలను నాయకులు వివరించారు. సమాఖ్య రాష్ట్ర ప్రతినిధులు గంగవరపు రామకృష్ణప్రసాద్, కండపనేని రత్నాకర్, యార్లగడ్డ రామచంద్రరావు, వైరా కమ్మజన సేవసమితి అధ్యక్ష, కార్యదర్శులు చింతనిప్పు వెంకటయ్య, రాంబాబు, ఉపాధ్యక్షుడు, మందడపు మధుసూదన్‌రావు, పొడపాటి నాగేశ్వరరావు, కట్టా కృష్ణార్జున్‌రావు, నాయకులు సూర్యదేవర శ్రీధర్, శ్రీరామనేని విజయభాస్కర్, మేదరమెట్ల శ్రీనివాసరావు, బండి కృష్ణప్రసాద్, పర్చూరి రాము, శ్రీమంత్ పాల్గొన్నారు.

వైరాలో అక్రమ రిజిస్ట్రేషన్ భూమి స్వాధీనం



ప్రభుత్వ స్థలంగా బోర్డు ఏర్పాటు చేస్తున్న గిర్దావర్

వైరా, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఐదో వార్డులోని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెవెన్యూ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఐదోవార్డులో ఉన్న సర్వేనెంబర్ 98లో ప్రభుత్వానికి చెందిన ఒక గుట్టలోని 430గజాల భూమిని ఓ మహిళ పేరుమీద గతంలో ఇక్కడ పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు. ప్రస్తుతం ఆయన వేరే జిల్లాలో సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సర్వేనెంబర్-98లోని ప్రభుత్వానికి చెందిన గుట్ట 275.55గజాలుగా ఉంటే ఆభూమిని గుట్టపక్కనే ఆనుకొని ఉన్న ఇళ్లతో కలిపి అక్రమంగా 709.55గజాలుగా అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌లో అప్పటి మునిసిపాలిటీ పాలకవర్గంలో ఒకరిద్దరు పెద్దలు, కమిషనర్, సబ్‌రిజిస్ట్రార్ భాగస్వాములయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌పై జిల్లా కలెక్టర్‌కు పిర్యాదులందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు అనేకసార్లు సర్వే నిర్వహించి దీన్ని ప్రభుత్వ భూమిగా తేల్చారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వైరా తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఈ వరుస పరిణామాల్లో భాగంగా ఈ స్థలాన్ని మంగళవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ ఆక్రమించిన వారు శిక్షార్హులవుతారని పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. డీటీ సురేష్‌బాబు, గిర్దావర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.